# న్యాయ పూర్తి వివరణ

న్యాయ పరిధి : ఇతరాలు
సెక్షన్ పరిధి : పౌరహక్కులు
ఉప సెక్షన్ పరిధి : ప్రజాప్రయోజన వ్యాజ్యం

## సంక్షిప్తంగా న్యాయ సమాచారం

న్యాయం అందరికీ అందుబాటులో వుండాలన్న ఉద్దేశ్యంతో న్యాయమూర్తులు ఇటీవల కాలంలో దీనిని ప్రోత్సహిస్తున్నారు. ఏ విషయంలోనైనా ప్రత్యక్ష వ్యక్తిగత సంబంధం లేని వారు కూడా ప్రజా ప్రయోజనంతో కూడిన సమస్యను కోర్టు దృష్టికి తీసుకురావటాన్ని కోర్టులు అనుమతిస్తున్నాయి. జోక్యం చేసుకునే హక్కును విస్తృతం చేసారు. అయితే బాధితుల ప్రాధమిక హక్కులకు భంగం కలిగి ఉండాలి.

## విపులంగా న్యాయ వివరాలు

ప్రజా స్ఫూర్తిగల వ్యక్తులు, లాయర్లు, సామాజిక కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు, ఎవరైనా కూడా బలహీన వర్గాలు, పేద ప్రజల పక్షాన, రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద సుప్రీం కోర్టులో, ఆర్టికల్ 226 కింద రాష్ట్ర హైకోర్టులో పిటీషన్ పెట్టవచ్చు.
ప్రజాప్రయోజన వ్యాజ్యం ఈ క్రింది సందర్భాలలో వేయవచ్చు:

ఏదైనా ఫ్యాక్టరీ వలన జల, వాయు కాలుష్యం కలిగి ప్రజల ఆరోగ్యానికి హాని కలిగినపుడు.
మానవహక్కుల రక్షణ కొరకు.
వెట్టిచాకిరీ, బాలకార్మికుల వ్యవస్థ నిర్మూలనకు
ప్రభుత్వము యొక్క నిర్ణయాల వలన పేద ప్రజలకు అన్యాయం జరిగినపుడు
ప్రభుత్వ, రాజకీయ రంగాలలో అవినీతి, లంచగొండితనం నిర్మూలనకై పోరాడడానికి.
మహిళలు, శిశువుల సంరక్షణార్థమై
మరేదైనా ప్రజాప్రయోజనం కొరకు.

## పరిష్కార పద్ధతి

## సెక్షన్ పేరు

ఆర్టికల్ 32, 226 - భారత రాజ్యాంగం

## ఫిర్యాదు ఎవరికి ఇవ్వాలి / ఎక్కడ ఇవ్వాలి ?

ప్రజా ప్రయోజన వ్యాజ్యం భారత రాజ్యాంగం ఆర్టికల్ 32,226 కింద సుప్రీం కోర్టులో కాని హైకోర్టులో కానీ వేయవచ్చు.

ప్రజా ప్రయోజనంతో కూడిన రిట్ పిటీషన్‌ని కూడా కోర్టువారు ప్రత్యేక అభ్యర్ధన మేర ప్రజాప్రయోజన వ్యాజ్యం కింద పరిగణించవచ్చు.

## కేసు ఫైల్ చేయడం ఎలా ?

బాధితులు, న్యాయస్థానం ద్వారా ప్రాధమిక హక్కులను అమలు పరచాలనుకున్నప్పుడు, దానికి సంబంధించిన వివరాలు, కాగిత పూర్వక సాక్ష్యాలను పిటీషనుతో జతపరచాలి, వారికి కావల్సిన సహాయం ఏంటో స్పష్టంగా తెలియజేయాలి, వీలయినంత మంది బాధితుల సంతకాలను సేకరించాలి.

హైకోర్టు:

పిటీషను 2 పత్రాలు కోర్టులో దాఖలు చేయాలి

ఒక కాపీ ప్రతివాదికి పంపించి, దానికి సంబందించిన రుజువును పిటీషనుతోపాటు దాఖలు చేయాలి.

సుప్రీమ్ కోర్టు :

5 పిటీషను పత్రాలు దాఖలు చేయాలి

ప్రతివాదికి కాపీ, నోటీసు పంపినపుడు పంపించాలి

కోర్టు ఫీజు

రూ. 50/- కోర్టు ఫీజు కట్టాలి. ఒక వేళ న్యాయమూర్తులకు పంపిన లెటర్‌గాని, టెలిగ్రాంగాని పిటీషన్‌గా స్వీకరించబడితే కోర్టుఫీజు ఉండదు.

విధానము

పిటీషను దాఖలు చేసిన తరువాత ప్రతివాది పక్షము వారు రిప్లై దాఖలు చేస్తారు. వాది ప్రతివాదనలను విన్న తరవాత, జడ్జి తీర్పును ఇస్తారు.

అవసరమైనపుడు కేసు విచారణకు కోర్టులే నిజనిర్ధారణ కమీషన్లు వేసి, వారి రిపోర్టులను సాక్ష్యాధారాలుగా తీసుకుంటారు.

కోర్టువారు తుదినిర్ణయం లేదా తీర్పు ఇచ్చేముందు, ప్రజాప్రయోజనార్ధం మధ్యకాలిన ఉత్తరువు జారీ చేయవచ్చు.

## తరువాత

హైకోర్టు వారి తీర్పు మీద సుప్రీం కోర్టుకు అప్పీలు చేయవచ్చు.

## ప్రత్యామ్నాయ పరిష్కారం

దరఖాస్తులను రాష్ట్ర న్యాయసేవా అధికార సంస్థ అధ్యక్షులకు కూడా పంపించవచ్చు.